క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎంపిక


పెద్దిరెడ్డి జ్యోతిశ్రీనివాస్

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శిగా గోపాలపురం నియోజకవర్గం ద్వారకాతిరుమలకు చెందిన పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటలో తెలిపింది. గత ప్రభుత్వంలో పెద్దిరెడ్డి సతీమణి వెంకట కొండ పద్మ ద్వారకాతిరుమల శ్రీవారి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యురాలిగా పనిచేయగా, జ్యోతి శ్రీనివాస్ ద్వారకా తిరుమల సొసైటీ అధ్యక్షుడిగా పని చేశారు. తనపై నమ్మకంతో రాష్ట్రస్థాయిలో బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ హోంమంత్రి, నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత, పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస్ వేణుగోపాలకృష్ణ, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజాకు కృతజ్ఞతలు తెలిపారు.

లాయర్ పట్టాపొందిన యువతికి సత్కారం


లాయర్ పట్టా పొందిన లక్ష్మీదుర్గను సత్కరిస్తున్న గ్రామస్తులు

గోపాలపురం: మండలం కొవ్వూరుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వేగివాడ లక్ష్మీదుర్గ లాయర్ పట్టా పొందింది. ఈ సందర్భంగా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత శాశ్వత కమిటి ఆమెను సత్కరించింది. ఈ మేరకు చైర్మన్ పెన్మత్స వెంకటనరసింహరాజు మాట్లాడుతూ కొవ్వూరుపాడు అల్లూరి బాపినీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిలకా లక్ష్మణస్వామి, ఎంపీటీసీ యడ్లపల్లి సూర్యనారాయణ, వేగివాడ నాగేశ్వరరావు,మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కె మస్తాన్ బాబా, పాఠశాల విద్యాకమిటి చైర్మన్ బొమ్మాదత్తుడు పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

సొసైటీ అధ్యక్షుడిగా బాధ్యతల స్వీకరణ


భాధ్యతలు స్వీకరిస్తున్న నాగేశ్వరరావు, సభ్యులు

పెరవలి: అన్నవరప్పాడు సొసైటీ అధ్యక్షుడుగా పాప్పాప్పు నాగేశ్వరరావు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. అయనతో పాటు మరో ఇద్దరు సభ్యులుగా బాధ్యతలు స్వీకరించారు. సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు నూతన సభ్యులకు అభినందనలు తెలిపారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి


నగదు పురస్కారాలు అందిస్తున్న ఎంఈవో, పూర్వ విద్యార్థి సభ్యులు

తాళ్లపూడి: వేగేశ్వరపురంలోని కేఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో దాతల సహకారంతో విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. 2024–2025 మెరిట్ చదువులో ప్రతిభకనబరిచిన 28 మంది విద్యార్థులకు రూ.72 వేలు నగదు, ప్రసంసా పత్రాలను కమిటీ సభ్యులు చేతులు మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారవు, పూర్వ విద్యార్థుల సంఘ సభ్యులు శీర్ల సత్యనారాయణ, మారిన రామ్మూర్తి, వీరమళ్ల తదితరులు పాల్గొన్నారు.

నీటియాజమాన్య పద్ధతులు తప్పనిసరి

పెరవలి: ప్రకృతి వ్యవసాయంలో ఆరుతడి ద్వారా పంటలను సాగు చేస్తే మంచి దిగుబడులు వస్తాయని జిల్లా సేంద్రియ వ్యవసాయ ఎగ్జిక్యూటివ్ సాకా రామకృష్ణ తెలిపారు. మండలంలోని కాపవరం, ఉసులుమర్రు గ్రామాల్లో నీటి యాజమాన్యంపై రైతులకు శుక్రవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. పంటకు నీరు అధికంగా ఉండాలనే రైతుల భావన ఒక అపోహ అని దాని వల్ల పంటకు తెగుళ్ల వ్యాప్తి అధికంగా ఉంటుందన్నారు. నీటిని తక్కువ శాతం అందించడం వలన పిలకలు ఎక్కువ శాతంలో రావటంతో పాటు దుబ్బులు బలంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, సేంద్రియ వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు

రెపరెపలాడిన త్రివర్ణ పతాకం


కొవ్వూరు పార్టీ కార్యాలయంలో జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే తలారి, నాయకులు


జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న తహసిల్దార్


పోలీస్ స్టేషన్ వద్ద జెండా ఎగురవేస్తున్న సీఐ తిలక్, సిబ్బంది

- వాడవాడలా జెండా వేడుకలు
- పోరాటయోధులకు నివాళులు
- ఉత్తమ సేవలు కనబరచిన ఉద్యోగులకు అవార్డుల ప్రధానం

తాళ్లపూడి(కొవ్వూరు): ఎందరో మహనీయుల ప్రాణ త్యాగ ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం లభించిందని వైఎస్సార్ సీపీ నియోజక వర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పేర్కొన్నారు. పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పార్టీ నాయకులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తలారి వెంట్రావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ జిలాల యువజన విభాగం అధ్యక్షుడు కంఠమణి రామకృష్ణ, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పిట్టా శ్రీనివాస్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కొవ్వూరు మండల వ్యాప్తంగా పంద్రాగష్టు వేడుకల్లో భాగంగా ప్రభుత్వ కార్యాలయాలు, పంచాయతీలు, ప్రభుత్వ పాఠశాలల్లో జాతీయ జెండా రెపరెపలాడింది. స్వాతంత్ర ఉద్యమంలో ప్రాణాలర్పించిన జాతి నాయకుల సేవలను గుర్తు చేసుకొని, జాతిపిత గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో రాణి సుస్మిత పతాకాన్ని ఎగురవేసి వందన సమర్పణ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే ముప్పడి వెంకటేశ్వరరావు, చైర్‌పర్సన్ భావన రత్నకుమారి, కమిషనర్ సందీప్ తదితరుల పతాకావిష్కరణలో పాల్గొన్నారు.

ఘనంగా పంద్రాగష్టు వేడుకలు

చాగల్లు: మండలంలోని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వాడవాడలా మువ్వెన్నెల జాతీయ జెండా రెపరెపలాడింది. స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో ఎం.మెరికమ్మ పతాకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, వీఆర్‌వోలు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి పతాకావిష్కరణ చేయగా ఎంపీడీవో ఆర్.శ్రీదేవి, ఎంపీటీసీలు యు.విజయకుమారి, కృష్ణవేణి, ఎస్.అర్జునుడు, పాషా తదితరులు పాల్గొన్నారు. పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్సై నరేంద్ర పతాకావిష్కరణ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ పతాకావిష్కరణలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవాలి

గోపాలపురం: మహాత్మాగాంధీ అడుగుజాడల్లో నేటి యువత నడుచుకోవాలని ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు చేసిన స్వాతంత్ర్య సమరయోధులను నిత్యం స్మరించుకోవాలని విద్యార్థులకు సూచించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ కె.అజయ్‌బాబు, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై డి.మనోహర్ సిబ్బందితో కలిసి వేడుకలు నిర్వహించారు.

గ్రామాల్లో రెపరెపలాడిన త్రివర్ణపతాకం

నిడదవోలు రూరల్: ఎందరో మహానుభావులు వీర మరణం పొంది భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించిపెట్టారని, ఆ త్యాగధనుల పుణ్యఫలంగా స్వేచ్ఛా, సౌభ్రాతృత్వం అనుభవిస్తున్నామని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి అన్నారు. నిడదవోలు మండలంలోని 23 గ్రామాల పరిధిలో 79వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలలు, స్వచ్ఛంద సంస్థలు ఆధ్వర్యంలో మువ్వెన్నెల జెండాను ఎగురవేసి జాతీయగీతాన్ని ఆలపించారు. సమిశ్రగూడెం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీపీ భాగ్యలక్ష్మి జాతీయ జెండాను ఎగురవేశారు. మహాత్మ గాంధీజీ, అంబేడ్కర్ చిత్రపటాలకు వైస్ ఎంపీపీ వడల రత్నకుమారి, ఎంపీటీసీలు అంగర ఝాన్సీరాణి, ఎంపీడీఓ జగన్నాథరావు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమిశ్రగూడెం పోలీస్‌స్టేషన్ వద్ద సీఐ పీవీజీ తిలక్, ఎస్సై ఎల్.బాలాజీ సుందరరావు ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళుర్పించారు. సమిశ్రగూడెం సచివాలయాల వద్ద సర్పంచ్ దేశాబత్తుల జోత్స్న ప్రియాంక, కార్యదర్శి, శ్రీనివాసరావు, తిమ్మరాజుపాలెంలో సర్పంచ్ ముప్పిడి చంద్రశేఖర్, కోరుమామిడి, విజ్జేశ్వరం గ్రామ సచివాలయాల వద్ద వద్ద సర్పంచ్ అంబటి గోపమ్మ, తిక్కా శ్రీనివాస్‌లు పతకావిష్కరణ చేశారు. జీడిగుంటలోని ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు రూ.15 వేలు విలువచేసే గోడ గడియాలను సర్పంచ్ మొక్కరాల శ్రీనివాస్ ఆర్థిక సహాయంతో అందజేశారు. సొసైటీల త్రిసభ్య కమిటీ సభ్యులు, పాఠశాలల వద్ద ఎస్ఎంసీ కమిటీ అధ్యక్షులు, గ్రామపెద్దల ఆధ్వర్యంలో త్రివర్ణ పతకాలు ఎగురవేసి స్వీట్స్ పంచారు.


సమిశ్రగూడెం పరిషత్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఎంపీపీ భాగ్యలక్ష్మి, అధికారులు


జీడిగుంటలో విద్యార్థులకు గోడ గడియారాలను అందజేస్తున్న సర్పంచ్ శ్రీనివాస్


పెరవలి పరిషత్ కార్యాలయంలో జెండాను ఎగురవేస్తున్న ఎంపీపీ

జాతీయ పతాకం రెపరెపలు

నిడదవోలు : నిడదవోలు నియోజకవర్గంలో వాడవాడలా 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, యువత, దేశ భక్తిని చాటుతూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు జాతీయపతాకాన్ని ఆవిష్కరించి అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కామిశెట్టి సత్యనారాయణ, ఎస్కే ఛాన్ భాషా, దాకే అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

175 అడుగుల మీటర్ల పతాకంతో ర్యాలీ..

పట్టణంలో రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో 175 అడుగుల జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహించారు. భారీ జాతీయ జెండాను పట్టుకుని పట్టణ ప్రధాన సెంటర్‌లలో ర్యాలీని నిర్వహించారు. సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు, దయామణి, ఈమని గ్రీష్మకుమార్, గెద్దం రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. గణపతి జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడి దేశభక్తిని చాటి చెప్పారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు, ఇన్నర్ వీల్ సభ్యులు, వాకర్స్ క్లబ్ సభ్యులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

యువత దేశం కోసం ఆలోచించాలి

పెరవలి: ఎందరో మహానుభావుల త్యాగాల ఫలితమే నేటి భారత దేశంలో ప్రజలు స్వేచ్ఛగా జీవితం గడుపుతున్నారని ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ అన్నారు. శుక్రవారం 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పెరవలి మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ జెండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి యువత మనకోసం కాకుండా, దేశానికి ఏం చేయాలో ఆలోచించాలని సూచించారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ దేశాన్ని ప్రపంచంలో అగ్రగామిగా నిలవాలంటే యువత వలనే సాధ్యమవుతుందని అప్పుడే నిజమైన స్వాతంత్ర్యం దేశానికి వచ్చినట్లు అని తెలిపారు. పెరవలి పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై యం.వెంకటేశ్వరరావు జాతీయ జెండాను ఎగురవేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద కె నిరంజన్ జాతీయ జెండాను ఎగురవేశారు. మండలంలోని 38 ప్రాథమిక పాఠశాలల్లో, 7 ఉన్నత పాఠశాలల్లోను స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, సొసైటీ అధ్యక్షుడు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తెర చాటున ప్రారంభోత్సవం


పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి కందుల దుర్గేష్


ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు (ఫైల్)

- మున్సిపల్ అధికారుల అత్యుత్సాహం
- పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మళ్లీ ప్రాంరభించిన వైనం
- శిలాఫలకంపై మాజీ ఎమ్మెల్యే పేరు తొలగింపు


మాజీ ఎమ్మెల్యే , మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి చిత్రాలను తొలగించిన అధికారులు

నిడదవోలు: ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే సంకల్పంతో, ప్రభుత్వ వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ ప్రజారోగ్యమే లక్ష్యంగా పట్టణంలో నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ నిధులు రూ.1.01 కోట్లు, రూ.35 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో మొత్తంగా కేంద్ర, రాష్ట్ర నిధులతో పాటు మున్సిపల్ సాధారణ నిధులతో 2024లో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రభుత్వం నిర్మించింది. ఈ మేరకు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన అప్పటి మాజీ ఎమ్మెల్యే జి. శ్రీనివాసనాయుడు ప్రారంభించారు. ప్రస్తుతం మున్సిపల్ సాధారణ నిధులు రూ.35 లక్షలు కేటాయించి మిగిలిన పనులను అసంపూర్తిగా పూర్తి చేసి దానికి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పేరుతో మళ్లీ రెండో సారి మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించడంతో ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఒకసారి ప్రారంభించిన భవనాన్ని మళ్లి ప్రారంభించడంతో పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. శిలాఫలకంలో డాక్టర్ వైఎస్సార్ పేరును, అప్పటి ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు పేర్లను వైట్ పెయింటింగ్‌తో కనిపించకుండా చెరిపేశారు. మంత్రి దుర్గేష్, చైర్మన్ భూపతి ఆదినాఆరయణ మెప్పు కోసం మున్సిపల్ అధికారుల అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా పాత శిలాఫలకంపై ఉన్న పేర్లను యధావిధిగా ఉంచెందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

విశిష్ట సేవలకు ప్రశంసాపత్రాలు


కలెక్టర్, మంత్రి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకుంటున్న తహసిల్దార్ మెరికమ్మ, దేవరపల్లి తహసల్దార్ శ్రీనివాస్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు సత్యనారాయణ దంపతులు, పెరవలి ఆర్ఐ పావని

చాగల్లు: చాగల్లు తహసీల్దార్ ఎం.మెరికమ్మ ఉత్తమ సేవా పురస్కరాన్ని అందుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని రాజమండ్రిలో జరిగిన వేడుకల కార్యక్రమంలో కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదుగా అత్యున్నత సేవా పురస్కరాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మెరికమ్మకు కార్యాలయ సిబ్బంది, వీఆర్‌వోలు, రేషన్ డీలర్లు, పలు రాజకీయ పార్టీల నాయకులు అభినందించారు.

ఎంపీడీఓకు ఉత్తమ సేవా అవార్డు

నిడదవోలు రూరల్: అత్యుత్తమ సేవలకు గుర్తింపుగా నిడదవోలు ఎంపీడీఓ వీఎస్‌వీఎల్ జగన్నాథరావుకు ఉత్తమ ఉద్యోగిగా పురస్కారం లభించింది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సందర్భంగా రాజమహేంద్రవరంలో మంత్రి కందుల దుర్గేష్, కలెక్టర్ పి.ప్రశాంతి చేతులు మీదుగా జగన్నాథరావు శుక్రవారం ప్రశంసపత్రం అందుకున్నారు. వీరిని తహసీల్దార్ బి.నాగరాజు నాయక్, పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డి, వివిధ శాఖల ఉద్యోగులు, స్థానిక ప్రజాప్రతినిధులు అభినందించారు.

దేవరపల్లి: మండలంలోని వివిధ ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు తమ విధుల్లో కనబరిచిన సేవాలకు గాను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారాలను అందుకున్నారు. ఈ మేరకు తహసీల్దార్ ఎం.శ్రీనివాస్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు బలుసు సత్యనారాయణ, విజయలక్ష్మి దంపతులు శుక్రవారం రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన అవార్డుల ప్రధానోత్సవంలో మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి వీరికి ప్రశంసా పత్రాలను అందించారు.

ఉత్తమ ఆర్ఐగా సేవా అవార్డు

పెరవలి: విధినిర్వాహణలో విశేష సేవలు అందించినందుకు ఉత్తమ ఉద్యోగిగా పెరవలి ఆర్ఐ పావని అవార్డు అందుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాజమండ్రిలో మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ ప్రశాంతి చేతులు మీదుగా ప్రశంసా పత్రాన్ని ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, జెడ్పీటీసీ కొమ్మిశెట్టి రామాంజనీ, మండల అధికారులు ఎంపీడీఓ ఘంటా శ్రీనివాస్, తహసీల్దార్ కె. నిరంజన్, డిడి, సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది అభినందించారు.

సీనియర్ అసిస్టెంట్‌కు సేవా అవార్డు

పెరవలి: పెరవలి మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ కె.ఎస్ శంకర్‌కు ఉత్తమ అవార్డులు శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఏలూరు జిల్లా పరిషత్ చైర్మన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. విధి నిర్వహణలో విశేష సేవలు అందించినందుకు ఈ అవార్డు వరించిందన్నారు.

మహారాజశ్రీ 11వ అదనపు జిల్లా జడ్జి తాడేపల్లిగూడెం వారి కోర్టులో

E.P.No.466/2020
A.R.C.No.401/2019

Between
M/s.శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్, తాడేపల్లిగూడెం ...DHR
మరియు
కలపాల విమల మరియు ఇతరులు ...JDRs

ఇందు పైనెంబర్ ఇ.పి. గ్రంథములో దిగువంది షెడ్యూల్ జె.డి.ఆర్. 1 అయిన కలపాల విమల గారికి చెందిన ఆస్తిని హైకోర్టులో వేలం వేయబడును. ఈ వేలం సదరు యాయస్థానం పాటలో పాల్గొనవచ్చును వేలం ది. 03.09.2025 వ తేదీన ఉదయం 10.30 గంటలకు పై కోర్టు వారి ఎదుట వేయబడును. పబ్లికేషన్ ద్వారా తెలియ పర్చడమైనది.

HEARING DATE : 03.09.2025

West Godavari District , Nallajarla mandalam, Ananthapalli Sub-District, Nallajarla grama Panchayat and Village Accounts,Zeriothy dry land coverd by R.S.No.1216/1, an extent of Ac.0.47 cents or 2274.8 sq.yards of vacant land is Bounded by:
East : Nalla cheruv
South: Land of Kalapala Seshayya
West : Land of Pakalapati Rattaiah
North : Land of Balusu Venkata Ratnam
(with all Easementarary Rights over The Schedule immovable Property for ingress and egress)

DHR Value : Rs.21,00,000/-
Amin value : Rs.15,00,000/-

HEARING DATE :03.09.2025

K.V.S.N.R GOPAL
Advocate, Eluru

తొలగించిన వ్యర్థాలు


తీపర్రులో చెత్తతో నిండి ఉన్న కాల్వగట్టు (ఫైల్)


స్పందించి చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి ఇంపాక్ట్

పెరవలి: మండల పరిధిలోని పలు పంట కాల్వలు బోదెల్లా మారి గట్లు ఆక్రమణలకు గురయ్యాయని రైతుల ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో 'గట్టుక్కున మింగేసి' అంటూ సాక్షి దినపత్రిలో ఈ నెల 14న ఓ శీర్షిక వెలువడటంతో అధికారులు స్పందించారు. ఆక్రమణ చెరలో చిక్కుకుపోయిన గట్లును శుక్రవారం ప్రోక్‌లెయినర్‌తో పటిష్ట పరించి వ్యర్థాలను తొలగించారు. ఈ మేరకు సమస్యను వెలుగులోకి తీసుకువచ్చిన సాక్షి దినపత్రికకు పలువురు స్థానికులు, రైతులు అభినందనలు తెలిపారు.

వరాల తల్లికి వేశేష పూజలు


ప్రత్యేక పుష్పాలంకరణలో కోటసత్తెమ్మ అమ్మవారు

నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయం శ్రావణమాసం సందర్భంగా శుక్రవారం భక్తులతో కిక్కిరిసింది. వేలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో నిర్వహించిన శ్రావణలక్ష్మి, ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతాల్లో పాల్గొనేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. సామూహిక కుంకుమార్చన కార్యక్రమానికి విచ్చేసిన సుమారు 1,500 మంది ముత్తైదువులకు దేవస్థానం ఆధ్వర్యంలో పసుపు, కుంకుమ, గాజులు, తమలపాకులు, అమ్మవారి లడ్డూ ప్రసాదాన్ని పంపిణీ చేశారు. అనంతరం భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ,అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్, ధర్మకర్తల మండలి ఛైర్మన్ దేవులపల్లి రవిశంకర్, ఆలయ ప్రధాన అర్చకులు ఎస్‌వీకే అప్పారావు శర్మలు పర్యవేక్షించారు.

వెల్లివిరిసిన శ్రావణ శోభ

చాగల్లు: మండలంలోని వివిధ ఆలయాల్లో శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవార్లను సుందరంగా అలంకరించారు. చాగల్లు కనకదుర్గమ్మ ఆలయం, ధనలక్ష్మి ఆలయంలో, గ్రామదేవత పాటెమ్మ వార్లను సుందరంగా అలకరించి పూజలు నిర్వహించారు. ఊనగట్లలో కనకదుర్గమ్మ, బ్రాహ్మణగూడెంలో గ్రామ దేవత నాగారమ్మ ఆలయంలోనూ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఆయా ఆలయాల్లో భజన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో కుంకుమ పూజలు చేపట్టారు.

వైభవంగా రాట ముహూర్తం

నిడదవోలు: పట్టణంలో గణేష్ సెంటర్‌లో వేంచేసియున్న పూజా గణపతి, కుమారస్వామి ఆలయంలో 103 సంవత్సర గణపతి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 9.35 గంటలకు వేడుకలకు రాట ముహూర్తం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు ఆధ్వర్యంలో వేద పండితులు స్వామివారికి పూజలు చేపట్టారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ముహూర్తం చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు, నిడదవోలు సీఐ పీవీజీ తిలక్, పట్టణ ఎస్సై జగన్‌మోహన్‌రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్‌కే వజీరుద్దీన్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కామిశెట్టి వెంకట సత్యనారాయణ, జనసేన పట్టణ అధ్యక్షుడు రంగా రమేష్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు ప్రమోద్ కుమార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనలు కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, జిహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిడదవోలు డివిజన్
90102 23729 (కొవ్వూరు) 90100 51493 (నిడదవోలు)
79956 78554 90100 68395 (గోపాలపురం)
Office mail : tpgadvt@gmail.com